# తీరనున్న బిల్లంకానిగూడెం రోడ్డు కష్టాలు

- మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న గ్రామస్తులు
- ప్రజల విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే చిరుమర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


వరద కాల్వపై నిర్మిస్తున్న కల్వర్టు

కట్టంగూర్, అక్టోబర్ 6 : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బిల్లంకానిగూడెం గ్రామానికి మూడు దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేదు. దాంతో గ్రామస్తులు రాకపోకల సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. అత్యవసర సమయంలో ఆస్పత్రి, ఇతర అవసరాల కోసం వెళ్లాంటే పొలాలు, చెట్లు, పుట్టల మధ్య నుంచి వెళ్లాల్సి వచ్చేంది. రోడ్డు మార్గం లేకపోవడంతో కొన్నిసార్లు కట్టంగూర్‌లోని అంబేద్కర్ నగర్ కాలనీ నుంచి గ్రామానికి వెళ్లాలంటే కాలనీ వాసులు వెళ్లనివ్వకపోవడంతో నానా అవస్థలు పడేవారు. గ్రామానికి రోడ్డు వేయాలని గతంలో ప్రభుత్వాలు, పాలకులు గ్రామస్తులు పలు మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రోడ్డు ఏర్పాటు స్థానిక జడ్పీటీసీ తరాల బలరాములు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రజల విజ్ఞప్తి మేరకు తన నిధుల నుంచి కిలో మీటర్ తారు రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. పనులు వెంటనే చేపట్టి గ్రామ శివారులో ఉన్న గుమ్మకోనికుంట కట్టపై ఉన్న కంపచెట్లను తొలిగించి వెడల్పు చేసి తారు రోడ్డు నిర్మించారు. హైవే పక్కన వరద కాలువపై నిర్మిస్తున్న కల్వర్టు పనులు పూర్తికావచ్చాయి. మూడు దశాబ్దాల కల నెరవేరనుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మా గ్రామానికి రోడ్డు మార్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. గతంలో ఎవరికి చెప్పిన పట్టించుకోలేదు. పిల్లలు పాఠశాలలకు తీసుకెళ్లాంటే నానా అవస్థలు తప్పేవి కావు. రాత్రి సమయాల్లో ప్రయాణం చేయాలంటే పొలాలు, కంప చెట్ల మధ్య నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామానికి రోడ్డు మార్గం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు రుణపడి ఉంటాం.

–యల్క సైదులు, గ్రామస్తుడు

### ఎమ్మెల్యే సహకారంలో రోడ్డు నిర్మాణం



సొంత జీపీ పరిధిలోని తూర్పాయిగూడెం గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడం వల్ల గ్రామస్తులు నానా అవస్థలు పడేవారు. సమైక్య పాలకులు గ్రామాల మధ్య లింకు రోడ్డు ఏర్పాటు చేయలేదు. గ్రామస్తుల కొరిక మేరకు రోడ్డు నిర్మాణ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రూ.10లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికే 90వాతం పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే సహకారంతోనేరోడ్డు నిర్మాణానికి మోక్షం లభించింది.

– జడ్పీటీసీ తరాల బలరాములు

## చెర్వుగట్టులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె పూజలు


రేగట్టె మలికార్జున్‌రెడ్డికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకుడు

నార్కట్‌పల్లి, అక్టోబర్ 6 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్గ బాలకృష్ణ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గోగులగుట్టతండాలో రేషన్ దుకాణం సబ్ సెంటర్ ప్రారంభం

తుర్కపల్లి, అక్టోబర్ 6 : మండలంలోని మోతీరాంతండా పరిధిలోని గోగులగుట్టతండాలో రేషన్ షాపు సబ్ సెంటర్‌ను జడ్పీ వైస్‌చైర్మన్ బీకునాయక్, ఎంపీపీ బూక్యా సుశీలారవీందర్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తాసీల్దార్ దేశీయా, సర్పంచులు బిచ్చునాయక్, ఎంపీటీసీ ప్రతిభా రాజేశ్, శ్రీను, భాస్కర్‌నాయక్, బాలు, రాజేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## గృహలక్ష్మితో పేదల సొంతింటి కల సాకారం

- 32వ వార్డు కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి


గృహలక్ష్మిప్రొసీడింగ్ పత్రాన్ని అందిస్తున్న కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంతో పేదల సొంతింటి కల సాకారమవుతుందని 32వ వార్డు కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వార్డులోని గృహలక్ష్మి లబ్ధిదారులకు ఆయన ప్రొసీడింగ్ పత్రాలను అందజేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 14న ఎంగిలిపువ్వు బతుకమ్మ

శాలిగౌరారం, అక్టోబర్ 6 : పండుగల తేదీల్లో సందేహాలు రావడంతో మండలంలోని బ్రాహ్మణులు శుక్రవారం మండల కేంద్రంలో సమావేశమై పండుగల తేదీలను ప్రకటించారు. ఈనెల 14న శనివారం ఎంగిలిపువ్వు బతుకమ్మ, 15న ఆదివారం దుర్గాదేవి నవరాత్రోత్సాలు ప్రారంభం, 22న ఆదివారం సద్దుల బతుకమ్మ, 23న సోమవారం దసరా (విజయ దశమి) పండుగను జరుపుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బ్రాహ్మణులు వావిలాల వేణునాథశర్మ, రామడుగు వెంకట్రామశర్మ, సుబ్రహ్మణ్యశర్మ, వెంకటేశ్వరశర్మ, ప్రశాంత్‌శర్మ, వావిలాల రామలింగయ్యశర్మ, రామకృష్ణశర్మ ఉన్నారు.

## కొనసాగుతున్న మూసీ నీటి విడుదల

కేతేపల్లి, అక్టోబర్ 6 : మూసీ ప్రాజెక్టు ఒక గేటు ద్వారా శుక్రవారం దిగువకు నీటి విడుదల కొనసాగింది. ప్రాజెక్టు గేటును ఒక అడుగు మేర ఎత్తి 661.45 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి కాల్వకు 244.35 క్యూ సెక్కులు, ఎడమ కాల్వకు 122.17 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తం 1101.49 క్యూసెక్కుల అవుట్ ఫ్లోను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 1410.40 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 644.50(4.30 టీఎంసీలు) అడుగులు ఉన్నట్లు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్‌కు శుభాకాంక్షలు

శాలిగౌరారం, అక్టోబర్ 6 : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియామకమైన విద్యార్థి సంఘం నాయకుడు జిల్లా శంకర్‌ను హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో బీఆర్‌ఎస్ యూత్ మండలాధ్యక్షుడు కల్లూరి నాగరాజుగౌడ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో చెవుగోని జాని, గొమ్మగోని నాగరాజు ఉన్నారు.

## రామన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాహత్‌ఖానమ్

రామన్నపేట, అక్టోబర్ 6 : రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాహత్ ఖానమ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ ఈమె ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను అధ్యాపక, అధ్యాపకులు సన్మానించారు.

కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, బెల్లి యాదయ్య, ఏఓ మంజర్ జాఫ్రీ, బాలనర్సింహా, ధర్మపురి మధు, ఇందిరా, రమాదేవి, అనిత పాల్గొన్నారు.

## జాల వాగులో గుర్రపుడెక్క తొలగింపు


జాలవాగు వద్ద గుర్రపుడెక్కను తొలగిస్తున్న ఆయకట్టు రైతులు

శాలిగౌరారం, అక్టోబర్ 6 : శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే ప్రయాణ మార్గంలోని జాలవాగు కత్వ వద్ద నీటికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్కను ఆయకట్టు రైతులు తొలగించారు. రామగిరి, శాలిలింగోటం గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం రాచకాల్వ వెంట వెళ్లి అడ్డుగా ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించి నీటిని మళ్లించారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి, సర్పంచ్ బండారు శంకరయ్యగౌడ్, రైతులు ఉన్నారు.

## 'మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి'


చేప పిల్లలను వదులుతున్న చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్, అక్టోబర్ 6 : మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నదని మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నకిరేకల్ అయ్యప్పగుడిపక్కన ఉన్న పెద్ద చెరువులో చేప పిల్లలు వదిలిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్‌గౌడ్, కమిషనర్ బాలాజీ, ముదిరాజ్ సంఘం నాయకులు బండమీది నర్సింహ, మెరుగు నాగరాజు, కారింగు నాగరాజు పాల్గొన్నారు.

## 8న విశ్వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక


కరపత్రం ఆవిష్కరిస్తున్న సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు

రామగిరి, అక్టోబర్ 6 : విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉచిత వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దాసోజు శ్రీనివాస్, పెందోట సోము, పరిచయ వేదిక కన్వీనర్ పగిడిమర్రి వెంకటాచారి తెలిపారు. నల్లగొండలోని సంస్థ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్ నివాసంలో నిర్వహించిన సమావేశంలో కరపత్రాల ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులోని విశ్వకర్మ భవన్(విశ్వబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహం)లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, విశిష్ట అతిథిగా విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రచారి హాజరవుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సేవా సంస్థ బాధ్యులు శ్రీపాద కృష్ణామాచారి, దాసోజు యాదగిరి, సూరోజు హైమవతి, బొడ్డుపల్లి రామకృష్ణ, కూరెళ్ల వెంకటేశ్వర్లు, తరుణోజు భీష్మాచారి, బైరోజు రఘవాచారి, దాసోజు మంజుల పాల్గొన్నారు.

## ఫార్మా పరిశ్రమలో వ్యక్తి మృతి


కృష్ణ(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 6 : మండలం దండు మల్కాపురం శ్రీజయ ఫార్మా పరిశ్రమలో విష రసాయనాలు పీల్చడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి కృష్ణ ఫార్మా పరిశ్రమలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. పరిశ్రమలో రియాక్టర్ సమస్య రావడంతో రియాక్టర్‌ను తెరవగా ఆధిక మొత్తంలో రసాయన వాయువులు విడుదల కావడంతో మృతుడు దానిని పీల్చడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. 108లో పరిశ్రమ యాజమాన్యం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే కృష్ణ మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య సుష్మ స్వరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ ఎస్ దేవేందర్ తెలిపారు.